www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 జులై 2025
5
అన్నమయ్య

సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన కార్మికులు

మిన్నంటిన ఆర్తనాదాలు

కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు శ్రీను, పోలమ్మ, రమణ

గుండెలవిసేలా రోదిస్తున్న గిరిజనులు

అప్పు చెల్లించేందుకు కూలీ పనికి వచ్చి మృత్యుఒడిలోకి!

రెడ్డిపల్లి లారీ బోల్తా ఘటనలో బాధితుల వేదన

కడప, రాజంపేట సర్వజనాస్పత్రుల్లో బాధితుల నరకయాతన

ఎస్‌పి ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితి పరిశీలన

కడపలో నలుగురి పరిస్థితి సీరియస్..ఒకరిని తిరుపతికి తరలింపు

క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి, కలెక్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

రాజంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/రాజంపేట అర్బన్/పుల్లంపేట/రైల్వేకోడూరు

పొట్టకూటి కోసం వలస కూలీలుగా రాత్రనక, పగలనక తేడా లేకుండా పనిచేసే శ్రమజీవులు, గిరిపుత్రులను రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఆదివారం రాత్రి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద మృతులు తొమ్మిది మందికి పంచనామా నిమిత్తం రాజంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా శ్రీకాళహస్తి, శెట్టిగుంట, వెంకటగిరి ప్రాంతాల నుండి వారి బంధువులు, కుటుంబ సభ్యులు సోమవారం ఆస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. మృతి చెందిన వారందరూ గిరిజనులే. డ్వాక్రా, పెళ్లి, ఇతర అప్పు చెల్లింపుల కోసం కూలికి వచ్చి మృత్యుఒడిలోకి చేరడం హృదయాన్ని మెలిపెడుతోంది. మూడ్రోజులుగా రాజంపేట మండలం ఇసుకపల్లిలోని మామిడితోటలో మామిడికాయల కోత పనులకు వచ్చి వెళ్తుండగా మూడవ రోజు లారీ బోల్తా పడిన ఘటనలో రెండు కుటుంబాలకు చెందిన 22 మంది ప్రమాదం బారిన సంగతి తెలిసిందే. వీరిలో ఒకే కుటుం బానికి చెందిన వ్యక్తులు 17 మంది ఉండడం విస్మయాన్ని కలిగిస్తోంది. లారీ బోల్తా ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది దుర్మరణం పాలు కాగా, మిగిలిన 13 మంది గాయాల బారినపడి కడప, రాజంపేట ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో రమణయ్య, శ్రీను, పోలమ్మ, వెంకటేశ్వర్లు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో అర్ధరాత్రి కడప సర్వజనాస్పత్రికి తరలించారు. జిజిహెచ్ వైద్యులు ఎస్‌ఐసియు, క్యాజువాలిటీ, ఆర్థో విభాగాల్లో ప్రాథమిక చికిత్స అనంతరం వెంకటేశ్వర్లు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో రెఫర్ చేయడంతో తిరుపతికి తరలించారు. మిగిలిన ముగ్గురి పరిస్థితి పక్కటెముకలు, తుంటెముకలు విరిగిన నేపథ్యంలో అటువంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు కర్నూలు, తిరుపతి ఆస్పత్రులకు సిఫారసు చేయాలనే ఆలోచనలో ఉండడం గమనార్హం.

మృతులందరూ గిరిజనులే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయాలపాయాలైన అందరూ యానాది సామాజిక వర్గానికి చెందిన వారే. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, వెంకటగిరి, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని శెట్టిగుంట ప్రాంతాలకు చెందిన వీరు జీవనోపాధి నిమిత్తం వలస కూలీలుగా ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో రాజంపేట మండలం ఇసుకపల్లికు చెందిన యానాదిరెడ్డి తన మామిడికాయలను రైల్వేకోడూరుకు తరలించే క్రమంలో రెడ్డిపల్లి వద్ద ఆదివారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

మృతుల వివరాలు...

లారీ బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన వారిలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కల్వకుంట గ్రామానికి చెందిన చిట్టెమ్మ (25), గజ్జల శ్రీను(33), రాధమ్మ(39), గుజ్జల రమణ(38), వెంకటగిరి మండలం ఓలివేడుకు చెందిన చీకోలు ముని చంద్ర (38), రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన శెట్టిగుంట గ్రామానికి చెందిన సుబ్బమ్మ (37), గజ్జుల దుర్గయ్య (32), వెంకటసుబ్బమ్మ (37) మృతి చెందారు.

క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి, కలెక్టర్

అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి రాజంపేట ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల రాయుడు, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు, బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, రైల్వేకోడూరు జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ బాధిత కుటుంబాలను పరామర్శించారు.

చంద్రబాబు, లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి

ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మృతులకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలి : సిపిఎం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హెచ్.చంద్రశేఖర్, రవికుమార్ ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతులకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చి ఆదుకోవాలన్నారు. వలస కూలీల నివారణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం ప్రకటించకపోవడం శోచనీయమని విమర్శించారు. చెరువు కట్ట పైన ప్రొటెక్షన్ వాల్

బాధితురాలితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

లేకపోవడం, రోడ్లకు గుంతలు ఉండటం వలనే అదుపుతప్పి కూలీలు మృతి చెందారన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటానని తెలిపారు.

పట్టని కూటమి సర్కారు : మాజీ ఎమ్మెల్యే

మామిడికాయల లారీబోల్తా పడిన ఘటనలో గాయాలపాలైన వారిని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లారీబోల్తా ఘటన చోటుచేసుకుని 24 గంటలు అవుతున్న ప్పటికీ మృతుల కుటుంబాలకు, గాయపడిన కుటుంబాలకు పరిహారం ప్రకటించా లనే కనీస స్పృహ కూడా కూటమి సర్కారు లేదని విమర్శించారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

యానాదుల సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పులి శివశంకర్, ప్రధాన కార్యదర్శి మీసం అంకయ్య, ఉపాధ్యక్షులు వెలుగు సుధాకర్ తదితరులు ఆసుపత్రి వద్దకు చేరుకొని బాధితులను పరామర్శించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతులకు రూ. 10 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించాలని కోరారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు సోమవారం ఎఎస్‌పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే పోలీసు బృందంతో కలిసి రెడ్డిపల్లి చెరువు కట్ట వద్దకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అధిక లోడుతో ప్రయాణం చేయకూడదని, టాప్‌పై ప్రయాణం సురక్షితం కాదని, డేంజర్ జోన్ ప్రదేశాలలో సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎస్‌పి పోలీసులకు సూచించారు.

పెళ్లి, డ్వాక్రా చెల్లింపుల కోసమే...

మామిడికాయల లారీ బోల్తా పడిన ఘటనలో తుంటెముక విరిగిన ఘటనలో గజ్జెల పోలమ్మను పలకరించగా ఇటీవలే కూతురికి పెళ్లి చేశానని, రూ.లక్ష పెళ్లి అప్పు, ప్రతి నెలా డ్వాక్రా రూ.10 వేలు చెల్లింపుల కోసం కుటుంబ మంతా కలిసి మామిడి కాయలకు వచ్చాం. రాత్రి తొమ్మిది గంటల సమయంలో లారీ బయల్దేరాము. లారీ డ్రైవర్ అడ్డదిడ్డంగా పోవడం వల్లే తమకీ పరిస్థితి తలెత్తింది.

- గజ్జెల పోలమ్మకు, వెంకటగిరి. తిరుపతి జిల్లా.

సిఆర్‌పి అప్పు చెల్లింపుల కోసమే

డ్వాక్రా, ఓ ఫైనాన్స్ సంస్థ దగ్గర తీసుకున్న అప్పు చెల్లింపుల కోసం శ్రీకాలహస్తి నుంచి మామిడి కాయల కోతల పనులకు వచ్చా. రైల్వేకోడూరు పట్టణ శివారులోని శెట్టిగుంట కాలనీలోని అత్తగారు పనులు ఉన్నాయని పిలవడంతో భార్యా, కుమారునితో కలిసి పనులకు వచ్చాను. భార్య, కుమారుని పరిస్థితి సైతం ఎలా ఉందో తెలియడం లేదు.

- పాకాయల రమణయ్య, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

సీజన్ కావడంతో కూలీ పనులకు వచ్చాం

కూలి పనుల సీజన్ కావడంతో పనులకు వచ్చాం. రోజుకు రూ.500 కూలి కావడంతో తన కుటుంబానికి చెందిన పెద్ద కుమారుడు మినహా మిగిలిన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, వారి పిల్లలతో కలిసి పనులకు వచ్చాం. ఇసుకపల్లిలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో శెట్టింగుంటకు తిరుగు ప్రయాణమయ్యాం. లారీ డ్రైవర్ వేగంగా నడుపుతుండడంతో పలుమార్లు చెప్పినప్పటికీ, ముందువెళ్లే వాహనాలను క్రాస్ చేసుకుంటూ వేగంగా నడపడంతో అదుపు తప్పి పడిపోయాం.

- గజ్జెల శ్రీనివాసులు, శెట్టిగుంట కాలనీ, రైల్వేకోడూరు.

కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మున్సిపల్ కార్మికుల న్యాయ సమ్మతమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు రిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు సోమవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా కార్మికులు రెండవ రోజు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె వల్ల పట్టణంలో వీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ వ్యవస్థ, తదితర అత్యవసర పౌర సర్వీసులకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో మున్సిపల్ శాఖ మంత్రి, ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని కార్మికులతో చర్చించి వారి న్యాయస మతమైన సమస్యను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి రమణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు పారిశుధ్య విభాగం కార్మికుల పూర్తి స్థాయిలో మద్దతునిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైసిపి నాయకుడు అన్నా సలీం ౦ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచి వారి కష్టాలు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది రెడ్డి ప్రసాద్, అక్బర్, శంకరయ్య, ఈశ్వర్, రెడ్డి, మల్లికార్జున, రమణ, రమేష్, రమాదేవి, వెంక టలక్ష్మి, మౌనిక, దేవా, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య, శానిటేషన్ వర్కర్స్ చెన్నయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జెసి కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో సోమవారం జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లోఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

: ఇందిరమ్మ కాలనీ వాసులు ఎదుర్కొం టున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిం చాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు డిసి వెంకటయ్య డిమాండ్ చేశారు. తమ తాగునీటి నీటిసమస్య తీర్చాలని ఇందిరమ్మ కాలనీ వాసులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా కాలనీవాసులకు తాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. కాలనీలోని ప్రజలంతా కూలీ పనులు చేసుకుంటే తప్ప కడుపు నిండని వారన్నారు. ఎప్పుడొస్తుందో తెలియని నీటి కోసం కాలనీవాసులు పనులు వదులుకొని ఎదురు చూడక తప్పడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో మున్సిపల్ అధికారులు ఘోరంగా విఫలం కావడంతోనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువులు కాలనీవాసులు పాల్గొన్నారు.

నయనానందకరం.. పుష్పయాగం

- ముగిసిన శ్రీసౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీసౌమ్యనాథ స్వామికి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ద్వాదశ రాధనలో భాగంగా 12 రకాలపూలు చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, సంపంగి, తామర, కలువ, మొగలిరేకులు వంటి వివిధ రకాల పుష్పాలు, తులసి, మరువం. ధవనం వంటి 4 రకాల ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. నైవేద్యాలు, మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ వేదికపైకి ప్రత్యేక అలంకరణలో ఆసీనులైన ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సునీల్ కుమార్, సాయి స్వామి లు విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కలను తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

పుష్పయాగం నిర్వహిస్తున్న పాంచరాత్ర ఆగమ పండితులు

బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

- ఎస్‌పిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలి
- నాయకులపై తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసనలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - మదనపల్లెఅర్బన్

మదనపల్లెలోని బుద్ధుడికొండలో బుద్ధుని విగ్రహాలపై పలు మార్లుగా దాడులకు పాల్పడుతున్న ముష్కరులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట బుద్ధుని కొండలో బుద్ధుని విగ్రహం తల నరికి చేతిలో పెట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నం చేసిన ముష్కరులను పోలీసులు గుర్తించాలని, గతంలో ఎలాంటి పటిష్టమైన చర్యలు పోలీసు వారు చేపట్టకపోవడం వల్లే మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని వాపోయారు. తాలూకా సిఐ కళా వెంకట్రమణ దుండగులను పట్టుకోవడంలో విఫలమై, ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బుద్ధుని కొండలో జరిగిన పరిణామాలు, పోలీసుల దుశ్చర్యల్లు, అక్రమ కేసులు బనాయించడం పట్ల సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు ప్రజా సంఘాల నాయకులు కూలంకుశంగా వివరించి పోలీసులపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయం బయటకు వారు మాట్లాడుతూ మదనపల్లె పోలీసులు దుండగులను పట్టుకోవడంలో విఫలమయ్యారని, ఎస్‌పి తన సొంత రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ నానా హైరానా పట్టిస్తున్నారని విమర్శించారు. ఎస్‌పి దుశ్చర్యలపై కర్నూలు రేంజ్ డీఐజీకి ఫిర్యాదు చేశామన్నారు. మదనపల్లె పోలీసులు, ఎస్‌పి ఆగడాలు ఇలాగే కొనసాగితే అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని, దక్షిణాది రాష్ట్రాల నాయకులను ఆహ్వానించి ఈనెల 28న చలో మదనపల్లె కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి పోలీసుల తీరును ఎండగడ తామని హెచ్చరించారు. పోలీసుల వైఫల్యాన్ని నిరసిస్తూ కార్యాలయం బయట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు,సిఐ కళావెంకటరమణపై డిజిపికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సత్వరమే పోలీసు యంత్రాంగం ఈ కేసును పట్టిష్టంగా తీసుకొని దుండగులను పట్టుకొని శిక్షించి, భవిష్యత్తులో పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముత్యాల మోహన్, బురుజు రవిశంకర్, చాట్ల బయన్న, ఎస్‌సి, ఎస్‌టి, బిసి నాయకులు శేఖర్, రాఘవేంద్ర యాదవ్, బ్యాంకు శీనన్న, కుమ్ము హరిబాబు, బిసి నాయకులు జయశంకర్, బడికలపల్లి నర్సింహులు, భాను ప్రకాష్, సొట్ట రెడ్డిశేఖర్, సిద్ధిగల నరేష్, బురుజు రెడ్డి ప్రసాద్, పలక ఆనంద్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాసరుద్దీన్ సహకారంతో అతని తండ్రి జ్ఞాపకార్థం సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కూడలి వద్ద పేద ప్రజలకు మాంసాహారంతో కూడిన అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాసరుద్దీన్ ప్రతి ఏటా తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదానంతో పాటు పేదలకు వస్త్ర దానం కూడా చేయడం పరిపాటిగా జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పెనిగలపాటి చంద్ర, కార్యదర్శి సింగంశెట్టి కృష్ణకుమార్, కోశాధికారి కంబాయి గారి నరసింహ, మాజీ అధ్యక్షుడు ఆరే వెంకటసుబ్బయ్య నాయుడు, సంగరాజు నరసింహ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ దుకాణాలు

ప్రజాశక్తి - గాలివీడు

పట్టణంలోని గేటు నుంచి బస్టాండ్ వరకు ఉన్న సూపర్ మార్కెట్లు, చిల్లర దుకాణాలన్నీ మూత పడిపోయాయి. విజిలెన్స్ అధికారుల రాకతో సోమవారం సాయంత్రం దుకాణాలు మూతపడ్డాయి. దుకాణాలు తనిఖీ చేయడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వస్తున్నారని సమాచారంతో అన్ని దుకాణాలు మూసివేశారు. ఏడాదికి ఒక పర్యాయమైనా దుకాణాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్‌లో రేటు నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అందుతున్నాయి. సామాన్య ప్రజలపై భారం పెరిగిపోతున్న ఇష్టానుసారంగా ధరలు పెరిగినయని రేట్లు అమ్ముతున్నారు. అయినా దుకాణాలపై విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే వాదనలు పేర్కొన్నారు. దుకాణాలపై దాడులు నిర్వహించి అత్యధిక నిల్వలు, అత్యధిక రేట్లతో వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేస్తే మరొక దుకాణదారుడు అక్రమాలకు పాల్పడడని పలువురు పేర్కొంటున్నారు.

అశోక్, కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

పంచాయతీ కార్యదర్శుల కమిటీ అధ్యక్షులుగా అశోక్

ప్రజాశక్తి - కలికిరి

పంచాయతీ కార్యదర్శుల కమిటీ అధ్యక్షులుగా అశోక్ ఎన్నియ్యారు. సోమవారం ఎంపిడిఒ రియాజ్ అహ్మద్ అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయంలో మండల పంచాయతీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి సంఘం అధ్యక్షులుగా అశోక్, ఉపాధ్యక్షులుగా బి.నవాజుల్లా, వి.గంగాదేవి, కోశాధికారిగా జి.గిరి, మీడియా కార్యదర్శిగా తనుజ, ప్రధాన కార్యదర్శిగా బి.గోపి, సభ్యులుగా బి.తిమ్మారెడ్డి సాయి కృష్ణ, మౌనిక జెనీఫా, మునిరాజా, రామ్మూర్తి నాయుడు వారిని నియమించారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ప్రభుత్వ భూములు వంకలు, వాగులు, చెరువులు, కుంటలు, గుట్టలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతటి వారైనా ప్రభుత్వ భూములను ఆక్రమించకూడదన్నారు. కొందరు ప్రభుత్వ భూములు మట్టి తరలింపు చేయడం ఇసుక అక్రమంగా రవాణా చేయడం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కులం, ఆదాయం, వన్-బి, ఆన్‌లైన్ ముటేషన్లు, రైతులు, ప్రజల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించి వెంటనే ఆన్‌లైన్ ముటేషన్లు చేస్తామన్నారు.కార్యక్రమంలో డిటి కృపావతి. ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ ఐటిఐలో సీట్ల భర్తీకి రెండవ విడత దరఖాస్తులకు గడువు పొడిగించినట్లు పీలేరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కె. బాల మురళీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశం కోరే విద్యార్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రంలోపు ఆన్లైన్ ద్వారా ఐటిఐ.ఏపీ.జిఓవి.ఇన్ అనే పోర్టల్ లో దరఖాస్తుచేసుకోవాలని తెలియజేసారు. దరఖాస్తు చేసుకున్న వారు 22వ తేదీ లోగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని, 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు ఫోటోలు, వెరిఫికేషన్ పామ్ లతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, పీలేరులో హాజరు కావాలని పత్రికా ముఖంగా తెలియపరిచారు. 10వ తరగతి ఫెయిల్ అయిన వారు కూడా వెల్డర్ కోర్సుకు అర్హులని సూచించారు.

ప్రతి విద్యార్థికీ విశ్వేశ్వరయ్య ఆదర్శం కావాలి

- విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె

ఇంజినీరింగ్ రంగంలో అపూర్వ కీర్తి సాధించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మదనపల్లి జడ్‌పి హైస్కూల్ ఆవరణంలో సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఘనంగా ఆవిష్కరించారు. మదనపల్లి లైసెన్స్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తలమానికమైన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను నిర్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆయన నిర్మించిన ప్రపంచ స్థాయి కట్టడాలు ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమని ప్రశంసించారు. విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మదనపల్లిలో ఆవిష్కరించడం తనకు గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన లైసెన్స్ ఇంజినీర్లను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం, జడ్‌పి హైస్కూల్ ఆవరణంలో విద్యార్థుల కోసం నిర్మించిన డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా డైనింగ్ హాల్ ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్లు జాకీర్, మహేంద్ర, నాగరాజా, బాబాజీ, సురేష్, రవీంద్రబాబు, చిన్నరెడ్డి, ప్రశాంతరెడ్డి, ప్రభాకర్ నాయుడు, హెడ్మాస్టర్ రమణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

'శక్తి యాప్‌తో మహిళలు, ఆడపిల్లలు సురక్షితం'

ప్రజాశక్తి-పీలేరు

శక్తి యాప్ వినియోగంతో మహిళలు, ఆడబిడ్డలకు రక్షణ లభిస్తుందని పోలీసులు తెలిపారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి వెంకటాద్రి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన 'శక్తి' యాప్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'శక్తి' యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం అందులోని 'ఎస్ఒఎస్ ఆప్షన్‌పై నొక్కిన వెంటనే ఘటనాస్థలనికి పోలీసులు చేరుకుంటారన్నారు. ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో 'శక్తి' యాప్‌లోని 'సేఫ్ ట్రావెల్' ఆప్షన్‌ను ఎంచుకుంటే చాలు, ధీమాగా, ధైర్యంగా, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చునని హెడ్ కానిస్టేబుల్ దశరథ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీసు శాఖ ఈ 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందనీ, ఫోన్ ఊపినా పోలీసులు వస్తారని, అత్యవసర పరిస్థితులు, ఆపదలో చిక్కుకున్న మహిళలు ఈ యాప్ ద్వారా పోలీసుల సహాయ, సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. యాప్ ఓపెన్ చేసి అందులోని ఎస్ఒఎస్ ఆప్షన్‌పై నొక్కిన వెంటనే 10 సెకన్ల నిడివిగల వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డై ఘటనా స్థలం లొకేషన్‌తో సహా పోలీసు కంట్రోల్ రూమ్‌కు వెళుతుందని, దీంతో బాధితురాలు ఎలాంటి పరిస్థితుల్లో ఉందో పోలీసులకు అర్థమవుతుందని. ఆ వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రక్షిస్తారని కానిస్టేబుల్ సుధాకర్ చెప్పారు. యాప్ సెట్టింగ్స్‌లోని 'హ్యాండ్ గెస్చర్' అనే ఆప్షన్ ఆన్ చేసి పెట్టుకుంటే, ఎస్ఒఎస్ బటన్ నొక్కలేని పరిస్థితుల్లో ఉన్నా సరే, ఫోన్ అటూఇటూ గట్టిగా ఊపినా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని కానిస్టేబుల్ సుధాకర్ అన్నారు. మహిళా పోలీస్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో యాప్‌లోని 'సేఫ్ ట్రావెల్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని. అందులో 'న్యూ ట్రాక్ రిక్వెస్ట్'లోకి వెళ్లి బయల్దేరిన ప్రాంతం, గమ్యస్థానం వివరాలు, వెళ్తున్న వాహనం నెంబరు కానీ ఈ కార్యక్రమంలో కూడా తదితరాలు ఎంటర్ చేయాలి. వాహనాన్ని, అది వెళ్లే మార్గాన్ని పోలీసు కంట్రోల్ రూం నుంచి గమనించి, వాహనం నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తుంటే, వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి, ఆమెను కాపాడతారని తెలియజేశారు. గృహహింస, కుటుంబ తగాదాలు ఇతరత్రా అంశాలపై ఫ్యామిలీ కౌన్సెలింగ్ తీసుకునేందుకు కూడా ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులకు వారి సెల్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్స్టాల్ చేయించారు. కార్యక్రమంలో సిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు రాధాకృష్ణ, నరసింహులు, చంద్రశేఖర్, సంతోష్, జానకి, అజిత, రషీద, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శక్తి యాప్ ఉపయోగాలు వివరిస్తున్న మహిళా కానిస్టేబుల్

50 మెట్రిక్ టన్నుల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం

మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట మోహన్

ప్రజాశక్తి- రామాపురం

అన్నమయ్య జిల్లాలో 50 మెట్రిక్ టన్నుల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకాలు నిర్వహించినట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట మోహన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 30 మండల కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి నేరుగా రైతులు విక్రయించుకునే విధంగా రైతు సాధికారత సంస్థ ప్రకృతి వ్యవసాయం చర్యలు తీసుకుందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని రాయచోటి కలెక్టరేట్ వద్ద 2023 ఆగస్టు 7న మొదలుపెట్టిన స్టాళ్ల క్రిమిసంహారక రసాయనిక ఎరువుల రహిత కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, బియ్యం 18 రకాల ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్నామని చెప్పారు. వినియోగదారుని ఆరోగ్య క్షేమం కోసం ప్రకృతి వ్యవసాయ రైతులకు స్టాళ్ల ఏర్పాటు చేసి మార్కెటింగ్ పరిస్థితులు ఆర్థిక స్వావలంబన చూసుకుంటూ జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ పనిచేస్తుందన్నారు మార్కెటింగ్ జూనియర్ పిఇ పవన్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్టాల్స్ ద్వారా రూ. 20 లక్షల మార్కెటింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ మండలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడకం వల్ల ఆరోగ్యపరంగా ఎంత మేలు చేగుతాయని ప్రజలందరూ రసాయనిక క్రిమిసంహారక మందులు వాడకం లేని కూరగాయలు ఆకు కూరలు పండ్లు కొనుగోలు చేసుకుని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయ సమీపంలో ప్రతి సోమవారం వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ తెలిపారు. కార్యక్రమంలో మండల మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్ర గౌడ్, మాడల్ మేకర్ సదాశివరెడ్డి, ఇన్‌ఛార్జులు వెంకటరామిరెడ్డి సుధాకర్, హరి, కదిరునిషా రెడ్డమ్మ, ఐసిఆర్‌పిలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులపై తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రైతుల పట్ల నిర్లక్ష్యం కారణంగా మామిడి పంటకు గిట్టుబాటు ధర లభించక నష్టపోయారని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో మామిడి రైతులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని తెలిపారు. వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షాన నిలబడి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చొరవ తీసుకుంటున్నారని వెల్లడించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన విధానాలను రూపొందిస్తోందని, మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు మార్కెట్ వేదికల మెరుగుదల వంటి చర్యలు ప్రారంభమైనట్లు ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యా సాగర్, పోతబోలు సుధాకర్, బాలూ స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బిటి కళాశాల పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఎంతో ఘన చరిత్ర కలిగిన మదనపల్లె బిటి కళాశాల పూర్వ వైభవానికి కృషి చేస్తున్నట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఇందులో భాగంగా మదనపల్లె బిటి కళాశాల పూర్వ విద్యార్థులతో పాటు మదనపల్లె పుర ప్రజలు కలసి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బిటి కళాశాలలో పూర్వ విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె బిటి కళాశాలకు 150 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఎన్నో ఉన్నత పదవులు అలంకరించారని, వారిలో ముఖ్యమంత్రి, మంత్రులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విదేశాల్లో స్థిరపడిన వారు ఉన్నారన్నారు. ఇలా ఎన్నో ఆణిముత్యాలు కళాశాల నుంచి వచ్చాయన్నారు. మనదేశ జాతీయగీతం జనగణమన ఇక్కడే పుట్టిందని, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మన బీటి కళాశాలలోనే జాతీయగీతాన్ని రచించి ఆలపించి దేశానికి అంకితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం బీటి కళాశాల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇందుకు అనేక కారణాలు ఉన్నాయన్నారు. వాటన్నిటిని అధిగమించి బిటి కళాశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. మరి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను కళాశాల విద్య కొరకు బీటీ కళాశాలలో చేరేలా వారికి ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఇందుకుగాను కళాశాలలో అన్ని వసతులతో కూడిన విద్యను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పునీత్, ఉత్తన్న, ఆకుల కిరణ్ కుమార్, శ్రీచందు మాట్లాడుతూ కళాశాలలో సర్టిఫైడ్ అధ్యాపకులు లేకపోవడం, అన్ని రకాల కోర్సులు కుదించి వేయడం, తరగతులు సక్రమంగా జరగకపోవడం వల్ల అడ్మిషన్లు కొరవడ్డాయన్నారు. ముఖ్యంగా ఇక్కడ చదువుకున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగా తగ్గిపోవడంతో తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇక్కడ చేర్పించేందుకు వెనకడుగు వేస్తున్నారని, ముందుగా వీటన్నిటిని అధిగమించాలని తెలిపారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల జోక్యం తగ్గించాలని, ధర్నాలు, రాస్తారోకోలు లాంటివి లేకుండా ఉన్నత విద్యా ప్రమాణాలపై దృష్టి సారించి అన్ని కోర్సులను ఇక్కడే ఏర్పాటు చేయాలని సూచించారు. వీటన్నిటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కళాశాలలో ఇకనుంచి అన్ని కోర్సులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, కళాశాల అభ్యున్నతికి చైర్మన్ కమిటీ ఏర్పాటు చేసి తగిన సలహాలు సూచనల ఆధారంగా కళాశాల ను ముందుకు నడిపించి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కరస్పాండెంట్ వై.ఎస్ మునిరత్నం, విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసం భాగస్వామ్యం కావాలి : 'నల్లారి'

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కలికిరి

ప్రభుత్వ అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హేమాచారి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో తహశీల్దార్లు, పలు శాఖల అధికారులు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి మన ప్రజల ఆదాయంలో వరల్డ్ నెంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కార్యక్రమం దీర్ఘకాలిక ఫలితాలు ఇవ్వబోతుందని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా పేదరికంలో దిగువన ఉన్నటువంటి 20 శాతం కుటుంబాలకు వెతికి వారి స్థితిగతులను, ఆర్థిక ప్రమాణాలు పెంచేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా పి-4 సర్వే కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలను మార్గదర్శులతో లింక్ చేయడం ద్వారా పేదరికం లేని సమాజం నిర్మించబడుతుందన్నారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే వినూత్నమైనదని దీర్ఘకాలంలో దీని ఫలితాలు ఎన్నో చూడబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న ఎన్నారైలు కాంట్రాక్టర్లు పారిశ్రామికవేత్తలు తదితరులను మార్గదర్శకులుగా తీసుకుని అట్టడుగున ఉన్న 20 శాతం మంది బంగారు కుటుంబాలతో లింక్ చేయబోతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రజల సమన్వయంతో ప్రజల యొక్క అవసరాలను గుర్తించి తగిన మార్గదర్శులతో మ్యాప్ చేయవచ్చన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన నుండి పుట్టిన పి4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 66,024 బంగారు కుటుంబాలను గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించామన్నారు. 2029 కల్లా పేదరికం లేని స్వరా?ంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శకులను బంగారు కుటుంబాలతో లింక్ చేసి బంగారు కుటుంబాలకు మార్గదర్శి చేయూత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడేలా చేయాలన్నారు. ఆర్థిక సహాయం చేయలేని వారు మాట సాయం లేదా చదువు చెప్పించడం లేదా అవకాశాలను చూపించడం ద్వారా బంగారు కుటుంబాలకు చేయూతనివ్వచ్చని ఈ దిశగా మార్గదర్శకులను ఎంపిక చేయాలని అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో పీలేరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పీలేరు నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి రోడ్డుపై బస్సు కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యార్థులను పట్టించుకోని ఆర్‌టిసి

ప్రజాశక్తి - గాలివీడు

విద్యార్థులను ఆర్‌టిసి పట్టించుకోవడం లేదని, స్కూల్‌కు వెళ్లడానికి రోడ్డుపై వేచి ఉన్న విద్యార్థులను బస్సులో ఎక్కించుకోవడం లేదని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్. ఫైజున్నీసా పేర్కొన్నారు. సోమవారం పాఠశాల వదిలిన తరువాత విద్యార్థినులందరూ వచ్చి రోడ్డు మీద నిలుచుంటే బస్సు ఆపకుండా వెళ్లిపోయింది. ప్రధానోపాధ్యాయురాలు కూడా రోడ్డుపై నిలబడి బస్సు ఆపినా ఫలితం లేకపోవడంతో రాయచోటి డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కదిరి-రాయచోటి మార్గం వెళ్లే బస్సు డ్రైవర్లు చేయి ఎత్తిన చోట ఎక్కించుకోవడం లేదని ప్రయాణికులు కూడా వాపోతున్నారు. ఆర్‌టిసి అధికారులు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు వెళ్లేటప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు బస్సు ఆపి వారిని ఎక్కించుకునేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం పేర్కొన్నారు.

మల్లమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - తంబళ్లపల్లి

తంబళ్లపల్లె మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు పూజారి శేఖర్ విజయనిర్మల వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించి, భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు

ఎంసెట్ మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకుల బృందం

విద్యార్థులకు ఎంసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి బాలికల జూనియర్ కళాశాల (హై స్కూల్ ప్లస్)లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులకు సోమవారం సాయంత్రం ఎంసెట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రధాన ఆచార్యులు (ఎఫ్ఎసి) గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంచే అందించే మెటీరియల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సంపాదించడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, పి.విజయ కుమారి, వల్లూరు మస్తాన్, ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్, శిల్పి ఆనందచారి, జీవి ప్రసాదరావు, గొంటుముక్కల వెంకటరమణ, గీత, జ్యోతి ప్రియా, గౌరీ, గాయత్రీ దేవి, డాక్టర్ శర్వాణి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు హేయం : వైసిపి

ప్రజాశక్తి-కలికిరి: రాష్ట్రంలో మహిళలపై రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొన్న బిసి మహిళ జడ్‌పి చైర్‌పర్సన్ హారికను కూటమి ప్రభుత్వ నాయకులు నిర్బంధించి నీచమైన పదజాలాలతో దూషించడం చాలా దారుణమైన విషయమని పేర్కొన్నారు. మహిళలపై కూటమి ప్రభుత్వం దాడులు చేస్తూ ఆనందిస్తున్నదని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఎస్‌సి, ఎస్‌టిలతోపాటు మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారని ఆయన గుర్తు చేశారు. తిరిగి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఊరుకునేది లేదని మహిళలతో కలిసి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను ఖండిస్తామని అన్నారు. అనంతరం వైసిపిలో ఉన్నతమైన స్థానాన్ని కల్పించిన రాజంపేట పార్లమెంటు సభ్యులు వెంకట మిథున్‌రెడ్డికి, పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞత అభినందనలు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తంబళ్లపల్లి : తంబళ్లపల్లె పట్టణంలోని పాత జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మదనపల్లె అర్ అర్ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత చిన్నపిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పురిటి పిల్లల నుంచి 18 ఏళ్ళు లోపు ఉన్న సుమారు 67మందికి జలుబు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు వైద్యులు రామిరెడ్డి, ప్రీతి చెప్పారు. బలమైన ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, చిన్నపిల్లలకు వచ్చే వ్యాధులు,జాగ్రత్తలు,పౌష్టికహారంపై అవగాహన కల్పించారు.

ఎస్‌టి సాధనకు పోరాడుదాం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా లభించే వరకు ఐకమత్యంగా కలిసి పోరాడదామని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల సంఘం (ఎపివిబిఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి నాగినేని గోవిందు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగినేని గోవిందు మాట్లాడుతూ వాల్మీకి బోయల ఎస్‌టి పునరుద్ధరణకు అన్ని సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. గత పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలతో వాల్మీకి బోయలను మోసం చేశారని మండిపడ్డారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశ ప్రధాని మోడీ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేస్తామని కర్నూలు సభలో హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ఇలా ప్రతి నాయకుడూ తమను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకొని గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీని తుంగలో తొక్కి వాల్మీకి బోయలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వాల్మీకి సంఘాలన్నీ కలిసి రావాలని, ఐక్య పోరాటం ద్వారానే మన ఎస్‌టి హోదాను సాధించుకోవచ్చునని తెలిపారు. వచ్చే రెండు నెలల్లో విజయవాడలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించి, తమ సత్తాను చాటాలన్నారు. **నూతన కమిటీ ఎన్నిక..** గౌరవాధ్యక్షులుగా చిన్నరెడ్డప్ప, ఉద్యోగ సంఘం గౌరవ అధ్యక్షులుగా బోడిమల్ల ఈశ్వరయ్య, మహిళ విభాగం రాష్ట్ర సెక్రటరీగా ఒప్పుల భాగ్యలక్ష్మి, అన్నమయ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షులుగా నల్లబోతుల అనసూయ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూమిక, బాలాజీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కళావతి, మదనపల్లె అధ్యక్షుడిగా పిల్లి చంద్ర ఎన్నిక కాగా వీరికి కర్నూలు జిల్లా అధ్యక్షుడు యల్లార్తి అర్జున్ నియామక పత్రాలు అందజేశారు. మహర్షి వాల్మీకి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు విష్ణు చైతన్య వీరికి మద్దతు తెలియజేశారు.

ఎన్నికైన ఎపివిబిఎస్ నూతన కమిటీ